క్లుప్తంగా

డీఎస్పీకి ఆహ్వానం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణ కేంద్రంలో శనివారం నిర్వహించనున్న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు రావాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీ రాజశేఖరరాజుకు ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లింగానాయక్, సిద్దునాయక్, చందునాయక్, బాలునాయక్ తదితరులున్నారు.

రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయంలో పూజలు


అగ్నిగుండం నుంచి నడుస్తున్న భక్తులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్‌లో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు సల్వాది ధనిష్ట సుశీల దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండా ఏర్పాటు చేయగా భక్తులు అందులో నుంచి నడిచి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు.

రేపు సీనియర్ కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక

హాలియా : వచ్చే నెల నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న సీనియర్ పురుషుల రాష్ట్ర కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా సీనియర్ కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక ఆదివారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ భూలోకరావు, కర్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఎంపికలో 85 కిలో బరువు కలిగి ఉండాలని క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు తీసుకొని హాజరుకావాలని కోరారు.

కళాకారులకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న కృష్ణారెడ్డి

చందంపేట : మండలంలోని ముర్పునూతల గ్రామంలో లోకసాని కృష్ణారెడ్డి (ఎల్‌కేఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోలాటం, భజన కళాకారులకు రూ.20వేలతో పాటు జూట్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాకారులు, పేద విద్యార్థులకు అన్ని విధాలుగా తోడుంటానన్నారు. ముందుందు మండలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామలింగం, ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ


చిరు వ్యాపారులకు గొడుగులు అందజేస్తున్న సభ్యులు

దేవరకొండ : పట్టణంలోని పలువురు చిరు వ్యాపారులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ప్రధాన రహదారిపై చిరు వ్యాపారాలు, చేతి వృత్తి పనులు చేసుకుంటున్న వారికి మిత్ర క్లబ్ అధ్యక్షుడు అంకం చంద్రమౌళి ఆధ్వర్యంలో గొడుగులు అందజేసి మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులకు గొడుగులు అందించడం తమ కర్తవ్యంగా భావించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కూరెళ్ల కృష్ణాచారి, మాకం మహేష్ పాల్గొన్నారు.

రాములమ్మకు నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

హాలియా : అనుముల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి తల్లి కుందూరు రాములమ్మ(85) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి హాలియా పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి వెంకట్‌రెడ్డిని పరామర్శించారు. మృతురాలు కుందూరు రాములమ్మ మృతదేహంపై ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు.

తిరుమలనాథుడి జాతరకు వేళాయే

- నేడు అలివేలు మంగమ్మ సమేత తిరుమలనాథ స్వామి కల్యాణం
- ఆకట్టుకోనున్న మూడు రాష్ట్రాల ఎద్దుల పోటీలు
- అధిక సంఖ్యలో రానున్న భక్తులు
- పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు


తిరుమలనాథస్వామి ఆలయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని రంగుండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ తిరుమల నాథస్వామి దేవాలయం జాతర శనివారం ప్రారంభం కానునుంది. ఈ ఆలయానికి ఎటూ చూసిన ఎత్తైన కొండలు, చుట్టూ పచ్చని చెట్ల మధ్యలో కొలువుదీరాడు తిరుమలనాథుడు. ఈ కోవెలలో కొలువైన స్వామిని కొలిచిన వారికి కొంగు బంగారంగా కావడంతో అనతికాలంలోనే ఆలయ ఖ్యాతి నియోజకవర్గంతో పాటు నలుదిశలా వ్యాపించింది. నాటి నుంచి నేటి వరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటూ స్వామి వారికి కానుకలు సమర్పిస్తుంటారు.

ఆలయచరిత్ర

శతాబ్ద కిందట స్వయంగా అలివేలు సమేత తిరుమలనాథ స్వామి వెలిశాడట. అయితే గుట్టకింద ఉన్న కోనేటిపురంలో బందిపోట్లు దొంగతనం చేయటానికి గుట్ట అవతలి నుంచి వస్తున్నారని స్వామి వారు కేకలు వేయడంతో దొంగలు దేవతా విగ్రహాలను ధ్వంసం చేసినట్లు ఆయన చరిత్ర చెబుతోంది. ఈ క్రమంలోనే గ్రామస్తులు ఆ విగ్రహాలను శాస్త్రబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజల సహకారంతో స్వామివారికి ఆలయాన్ని ఏర్పాటు చేయించి పూరాతన దేవతామూర్తుల విగ్రహాలతో పాటు నూతనంగా విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రతీ ఏటా మాగశుద్ధ పౌర్ణమి రోజున స్వామి అమ్మివార్ల కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది.

కార్యక్రమ వివరాలు..

శనివారం ఉదయం 7.15 నిమిషాలకు గణపతిపూజ, స్వస్తివచనం, అఖండధీపారాధన ఆదిత్య నవగ్రహ, ఇంద్రాద్రి, అష్టదిక్పాలక పూజ, సర్వదేవతహ్వానం, ఉదయం 8.15 నిమిషాలకు ఆంజనేయస్వామి సిందూరపూజ, 8.45కు స్వామి అమ్మవార్లకు పంచామతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తరం, సర్వదర్శనం, 11.59 నిమిషాలకు స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు నియోజకవర్గం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఈ గట్టుపైకి వెళ్లాలంటే భక్తులు నరకయాతన పడేవారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం, రాళ్లు, ముళ్లలతో భయంకరంగా ఉండటంతో స్వావారికి కల్యాణానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొన్ని సందర్భాల్లో భక్తులు స్వామివారిని దర్శనం చేసుకోకుండానే, కల్యాణంతోనే సరిపెట్టుకొని వెళ్లి పరిస్థితులు ఉండేవి. దీంతో దేవస్థాన కమిటీ రెండేళ్ల కిందట కొండపైకి వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులకు కొండపైకి వెళ్లటానికి ఇబ్బందులు తొలగిపోయాయి.

ప్రారంభం కానున్న ఎద్దుల పోటీలు

తిరుమలనాథుడి బ్రహ్మోత్సవాలు అనగానే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు, భక్తులకు ముందుగా గుర్తుకు వచ్చేది ఎద్దుల పోటీలు. అయితే కొన్నేళ్ల నుంచి ఆలయ కమిటీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాష్ట్రాల ఎద్దుల పోటీలను నిర్వహిస్తుంది. శనివారం మధ్యాహ్నం 2.గంటలకు ఈ పోటీలను ప్రారంభించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నాగార్జునసాగర్ సీఐ ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



“తిరుమలనాథుడి కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వామివారి ఆలయం పూరాతనమైనది కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. గతంలో కొండ పైకి భక్తులు వెళ్లి దర్శించుకోవటానికి ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెండేళ్ల కిందట రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశాం.

– బుర్రి రాంరెడ్డి, ఆయల కమిటీ చైర్మన్

వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో బీజేపీ విజయ సంకల్పయాత్ర సన్నాహక సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, మరోసారి మోదీ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాణవత్ రతన్‌సింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీజేపీ నాయకులు సాంబయ్య, సాధినేని శ్రీనివాస్‌రావు, రమేష్, పురుషోత్తంరెడ్డి, సైదులు, హన్మంతరెడ్డి, మదన్‌మోహన్, భరత్., అశోక్‌రెడ్డి, సరిత, ఏడుకొండలు, శ్రీనివాస్, రాజీరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడిగా విక్రమ్


నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ఐఎన్‌టీయూసీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మాడుగులపల్లి మండలం కుక్కడం సమీపంలోని విశాఖ ఇండస్ట్రీస్‌లో చేస్తున్న వంటిపాక విక్రమ్‌ను నియమిస్తూ ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విక్రమ్‌క నియామకపత్రాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతంతో పాటు పార్టీ పటిష్టకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన యూనియన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా యూనియన్ అధ్యక్షులు అంబటి సోమయ్యలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నూకపంగ నాగయ్య, విశాఖ ఇండస్ట్రీస్ యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, అప్జల్, నగేష్ తదితరులున్నారు.

ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు అవాస్తవం


వివరాలు వెల్లడిస్తున్న రివర్ ఆస్పత్రి ఎండీ

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ రివర్ ఆస్పత్రిపై గుండె జబ్బు బాధితుడు ప్రవీణ్‌కుమార్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తమని ఆస్పత్రి మేనేజింగ్ డైరక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోగి ప్రవీణ్‌కుమార్‌కు చేసిన యాంజియోగ్రాం స్టంట్ల వివరాలను వీడియోగ్రఫీ ద్వారా వివరించారు. ప్రవీణ్‌కుమార్ గుండెలోని ఎల్ఏడీ నాళం పూర్తిగా దెబ్బతిందని దానికి స్టంట్ వేయడం సాధ్యపడదని తెలిపారు. మిగితా రెండు నాళాలకు నాలుగు స్టంట్లను వేశామని తెలిపారు. పూర్తి వైద్య నిబంధనలు పాటించి డాక్టర్ సంపత్ కుమార్ ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు చేసిన వైద్యానికి సంబంధించి పూర్తి నివేదికలు ఆస్పత్రిలో ఉన్నాయని, అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దీని వలన ఆస్పత్రి ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో గుండె వైద్య సేవలు నిరుపేదలకు అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ముగిసిన అజహరత్ అబ్బాస్ దర్గా ఉర్సు


దర్గా వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


దర్గా వద్ద పూజలు నిర్వహిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

చింతపల్లి : మండల పరిధిలోని పీకే మల్లేపల్లి గ్రామంలోని అజహరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉర్సు ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు కన్నుల పండువగా సాగిన ఉర్సు నల్లగొండ జిల్లాతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు దర్గా, మక్కా మహేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుత్తా అమిత్‌రెడ్డి, దర్గా చైర్మన్ జేవీ.రమేశ్‌రాజు, సయ్యద్ పాషా, ఎండి.యూసుఫ్‌పాషా, ఎండి.సులేమాన్, కృష్ణ, జానిమియా, అబ్బయ్య, షేక్‌వలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని చిల్లాపురంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, కీర్తీ ధ్వజస్తంభ, విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సం ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. 25న విఘ్నేశ్వ పూజ,. పంచామృతాభిషేకాలు, సాయంత్రం బలిహారణ, సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఊరేగింపు, తారకరామ మూలమంత్ర హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సాతునూరి అంజయ్య, ఉపాధ్యక్షులు కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జానపాటి శ్రీను, కార్యదర్శి అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి రేణుకాబాయి, పెద రామలింగయ్య గౌడ్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మల్లికంటి వెంకటేశ్వర్లు, అనుముల సైదయ్య, సతీష్ పాల్గొన్నారు.

'ఆత్మ' డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ ఆత్మ స్టాఫ్ అసోసియేషన్ యూనియన్ నూతన డైరీని శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని ఉద్యోగులు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణానాయక్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ట్రెజరర్ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యక్షులు అపర్ణారెడ్డి, సాయిచరణ్, రవీందర్, వినోద్, స్పందన, జయంతి, కిరణ్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఐక్యూఏసీ బృందం తనిఖీ


ఐక్యూఏసీ బృందం సభ్యులతో కళాశాల అధ్యాపకులు

దేవరకొండ : మండల పరిధిలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల కళాశాలను శుక్రవారం ఐక్యూఏసీ(ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్) బృందం సభ్యులు సందర్శించారు. కళాశాలలో రికార్డుల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, విద్యార్థుల నమోదు, ప్రాజెక్టుల వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులకు వారు పలు సూచనలిచ్చారు. కళాశాల న్యాక్ గుర్తింపు పొందేందుకు అవసరమైన విషయాలపై బృందం సభ్యులు చర్చించారు. కో–ఆర్డినేటర్ రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీనివాస్ రెడ్డి, నరేష్, జ్యోతి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు ఉన్నారు.

ప్రముఖ విద్యావేత్త షేక్ వహీద్ మృతి


షేక్ వహీద్, (ఫైల్)

హాలియా : పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, స్థానిక అక్షయ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ వహీద్(58) అనారోగ్య కారణంగా గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన 30 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేష సేవలందించారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలకుగాను ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. అనుముల మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అధ్యక్షుడిగా ఉన్న షేక్ వహీద్ తెలంగాణ ఉద్యమ సమయంలో ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన ఏకైక ప్రైవేట్ ఉపాధ్యాయుడు షేక్ వహీద్ కావడం విశేషం. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్షయ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ వహీద్ మృతిపై ఆ పాఠశాల డైరెక్టర్ భిక్షపతితో పాటు ప్రైవేట్ పాఠశాలల టీచర్స్ అధ్యక్షుడు రాంబాబు, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, పూర్వ విద్యార్థులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

చెరువు మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామ తాటిచెరువులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండటంతో గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణను పంపించి మట్టిని తరలించడాన్ని నిలిపివేయించారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి


దేవరకొండ : రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని సీపీఎం దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు మృతికి మోదీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్‌చేశారు. మరణించిన రైతు కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో లింగయ్య, రహీం, శ్రీను, వెంకటేష్, అంజి, కాశయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నల్లగొండరూరల్: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో స్థానిక పాల కేంద్రం వద్ద రైతు సంఘం కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. రైతులు గిట్టుబాటు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటాలు చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాములు, సైదులు, లక్ష్మయ్య, అంజయ్య, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన తెనాలి లింగారెడ్డి తల్లి తేనాలి వెంకటమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి వెంకటమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, నాయకులు కృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, లింగారెడ్డి, సత్యంరెడ్డి, మన్మథరెడ్డి, సాయిరాంరెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి


ఆందోళన చేస్తున్న నాయకులు

నల్లగొండ : మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని కోరుతు శుక్రవారం బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కార్యక్రమంలో కంచోజు మల్లికార్జున్, గంగాధరి రామ్మూర్తి, రమేష్‌కుమార్, రాము, వెంకన్న, ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 28వ వార్డులోని బచ్పన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాయం ఉపేందర్‌రెడ్డి, కౌన్సిలర్ కోమ్ము శ్రీనివాస్, నాయకులు చలపతిరావు, సయ్యద్ తదితరులున్నారు.

పలువురికి సన్మానం

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన ఎడ్ల రమేష్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కొండేటి సరితలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి బృంధావన్ గార్డెన్‌లో శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, బాణావత్ రతన్ సింగ్‌నాయక్, అశోక్‌రెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


అల్వాల పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి పలువురుని ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు బహుమతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాపోలు పరమేష్, ఉపాధ్యాయులు తుమ్మురుగోటి జ్యోతి, పాపని బాలకృష్ణ, విజయలక్ష్మీ, లింగమ్మ, వీరయ్య, గౌస్‌బాబా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని చైతన్యనగర్‌లో శుక్రవారం మహిళ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వన్‌టౌన్ ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం మంగలదుబ్బతండాకు చెందిన కొర్ర ధనలక్ష్మి(29) గత మూడేళ్లుగా తన భర్త లక్ష్మణ్‌కు దూరంగా ఉంటుంది. పట్టణంలోని చైతన్యగనగర్‌లో గల తన అక్క, బావ విదేశాల్లో ఉంటుండగా వారి పిల్లలను చూసుకుంటూ వారింట్లోనే తన తొమ్మిదేళ్ల కుమారుడితో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే.. ఆమె మృతికి దామరచర్ల మండలం మొదుగులదండాకు చెందిన మహేష్ అనే వ్యక్తి కారణమని ధనలక్ష్మి తమ్ముడు ధీరావత్ దామోదర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీబీఎస్ఈ తెలుగు పరీక్ష ప్రశాంతం

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, నార్కట్‌పల్లి శ్రీ విద్యాపీఠ్ పాఠశాలలలో శుక్రవారం జరిగిన సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో 103 మంది విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ సూపరింటెండెంట్ జి.రమేష్‌కుమార్ తెలిపారు. నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో శ్రీ విద్యాపీఠ్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, విపస్య స్కూల్ విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు. నల్లగొండలోని కేవీఎస్‌లో జరిగిన పరీక్షకు 146 మంది విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ సూపరింటెండెంట్ రాచల్ మాథ్యూ తెలిపారు. నార్కట్‌పల్లిలోని శ్రీ విద్యాపీఠ్‌లో 62 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు సెంటర్ సూపరింటెండెంట్ సుష్మిత పేర్కొన్నారు.

సంత్ గాడ్గే బాబాకు నివాళి


నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్

నల్లగొండ టౌన్ : సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా 149వ జయంతిని పురస్కరించుకుని బాబా చిత్రపటానికి స్థానిక పూలే విగ్రహం వద్ద రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, రజక అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ చిలకరాజు చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్‌కుమార్, బీమనపల్లి శంకరయ్య, ఆమంచి అంజయ్య, చిక్కుల్ల రాములు, సత్తయ్య, ఎల్లుట్ల సైదులు, పగిళ్ల వెంకన్న, బూతరాజు సత్తయ్య, వెలిజాల అంజయ్య, నాగిళ్ల శంకర్, ఈదయ్య, యాదయ్య, మల్లేష్, యాదగిరి, జానీ నర్సింహ, దుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థికి బెల్ట్ అందజేస్తున్న అమిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ది తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో శుక్రవారం జరిగిన కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని నైపుణ్యత చాటాలని కోరారు. అనంతరం పలువురికి కలర్ బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకుడు యామ దయాకర్, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కత్తుల శంకర్, ప్రణీత్, కమల్ తదితరులు పాల్గొన్నారు.